ప్రజాశక్తి
శుక్రవారం 18 జులై 2025
5
అనంతపురం

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

'మాకివ్వాల్సింది ఇచ్చుకోండి... మీకావాల్సింది దండుకోండి'..! అన్న చందంగా ఎక్సైజ్ శాఖ పనితీరు మారిందనే విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు బెల్ట్‌షాపులు లేకుండా చేస్తామని ప్రకటిస్తుంటే ఆచరణలో మాత్రం ఊరూరా బెల్ట్‌షాపులే నడుస్తుండటం గమనార్హం. నిబంధనలను సైతం తుంగలోకి తొక్కి ఎంఆర్‌పికి మంగళం పాడారు. జిల్లా కేంద్రం మొదలుకుని గ్రామీణ ప్రాంతం వరకు ఎక్కడా ఎంఆర్‌పి అమలు జరుగుతున్న దాఖలాల్లేవు. అంతా బహిరంగంగా నడుస్తున్నా నివారించాల్సిన ఎక్సైజ్ శాఖ మిన్నకుండిపోవడం అనేక ఆరోపణలకు తావిస్తోంది. నెలవారీగా మద్యం దుకాణాల నుంచి ఒక ధరను ఫిక్స్ చేసి వసూళ్ల పర్వం సాగుతోందన్న ఆరోపణలున్నాయి. దీంతో మద్యం విక్రయాలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది.

గతేడాది విక్రయాలకంటే 92 శాతం అధికంగా ఈ త్రైమాసికంలో జరగడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.



మాకిచ్చుకోండి...మీరు దండుకోండి..!

- ఊరూరా బెల్ట్‌షాపులు
- ఎమార్పీ కంటే అదనంగా అమ్మకాలు
- మద్యం విక్రయాల్లో నిబంధనలు గాలికి
- తనిఖీ యాప్‌లు మద్యం విక్రేతల వద్దనే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలున్నాయి. జనాభా ప్రతిపాదికన ఈ మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ దుకాణాల్లో మాత్రమే విక్రయాలు జరగాల్సి ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో మద్యం విక్రయాలు జరగాలి. కాని ఎక్కడా ఎంఆర్‌పి అమలు జరుగుతన్న దాఖలాల్లేవు. ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూళ్లు జరుగుతున్నాయి. ఇదేదో మారుమూల ప్రాంతంలోనే కాదు... అనంతపురం నగరంలోనూ అధిక ధరకే విక్రయాలు నడుస్తున్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామంలో సగటున మూడు వరకు బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి. ఈ బెల్ట్‌షాపులు నిర్వాహకులు మద్యం దుకాణాల వద్ద రూ.50 వేల వరకు డిపాజిట్ చేసి మరీ కొనుగోలు చేస్తున్నారు. వీరు కూడా ఎంఆర్‌పి కంటే రూ.10 అదనంగా పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇక ఈ బాటిళ్లపై ఒక్కో దానిపై రూ.30 వరకు అదనపు ధరకు మద్యం విక్రయాలు నడుస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ స్థాయిలో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నా నివారించాల్సిన ఎక్సైజ్ శాఖ మిన్నకుండిపోవడం వెనుక పెద్ద మతలబే ఉందన్న ఆరోపణలున్నాయి. ఒక్కో మద్యం దుకాణం నుంచి రూ.45 వేల వరకు ఆ శాఖకు ముడుపుల రూపంలో నెలనెలా అందుతున్నట్టు ఆరోపణలున్నాయి. వీటిని ఉన్నతాధికారుల వరకు చేరుతున్నట్టు ఎక్సైజ్ శాఖలోనే చర్చ నడుస్తోంది. కొన్ని చోట్ల పర్మిట్ రూములు కూడా నడుస్తున్నా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపంచడం లేదు.

మసకబారిన నిఘా

మద్యం విక్రయాల్లో నిబంధనలు పాటించకుండా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా నిఘా విభాగాలున్నాయి. ఇఎస్‌టిఎఫ్, విజిలెన్స్ విభాగాలున్నాయి. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిఘా సంస్థలు కూడా నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రతి నిత్యం ఆయా సర్కిళ్ల పరిధిలో సిబ్బంది తనిఖీలు నిర్వహించాలి. పోలీసు స్టేషన్‌కు వెళ్లి జిపిఎస్‌లో పంచింగ్ చేయాల్సి ఉంది. ఎక్సైజ్ ఐపి యాస్ కేవలం సిబ్బంది వద్ద మాత్రమే ఉండాలి. ఇందుకు భిన్నంగా ఆ యాప్‌ను మద్యం విక్రేతల మొబైల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి వారి ద్వారా పంచింగ్ చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ రకంగా తనిఖీలను మమ అనిపించేస్తుండటం విశేషం.

92 శాతం అధికం

మద్యం విక్రయాల పరంగా చూసినా అమ్మకాలు ఏ మేరకు సాగుతున్నాయన్నది స్పష్టం చేస్తోంది. 2024లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మొదటి త్రైమాసికంలో 3.51 లక్షల కేసులు అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది అంటే 2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు చూస్తే 6.74 లక్షల కేసులు అమ్మకాలు జరిగాయి. సాధారణం కంటే 92 శాతం అధికంగా అమ్మకాలు జరిగాయి. ఆదాయం పరంగానూ అంతకు మునుపు త్రైమాసికంలో రూ.226.47 కోట్లుకాగా, ఈ ఏడాది రూ.302.78 కోట్లు అమ్మకాలు జరిగాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 300పైబడి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. అయితే కళాశాలలో సమస్యలు తాండిస్తున్నాయన్నారు. ముఖ్యంగా భోజనశాల లేకపోవడంతో విద్యార్థులు తరగతి గదులు, చెట్ల కింద కూర్చొని మధ్యాహ్న భోజనం చేయాల్సి వస్తోందన్నారు. అలాగే మరుగుదొడ్లు లేకపోవడంతో బహిరంగ ప్రదేశాలకు వెళ్తున్నారన్నారు. మరోవైపు క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి పీడీ లేకపోవడం బాధాకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ కేంద్రానికి విద్యను అభ్యసించడానికి వస్తున్న విద్యార్థులు కళాశాల ఉదయం 9 నుంచి నుండి సాయంత్రం 5 గంటల వరకూ సమయం ఉండటంతో విద్యార్థులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున కళాశాల సమయపాలనను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తి కావస్తున్నా డిగ్రీ కళాశాలలో సంబంధించి ప్రవేశాలు అనుమతి ఇవ్వకపోవడం చాలా దౌర్భాగ్యమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడుగా పి.రాజు, పట్టణ కార్యదర్శిగా వరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా గంగాధర్, సమీరా, రెడ్డి శిరీషా, సహాయ కార్యదర్శులుగా హరీష్‌నాయక్, శివకృష్ణ, సుకన్య, సమీరిన్, చరణ్‌తేజ్, తదితరులను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జైవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీలకు ఏఎస్పీలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

రాష్ట్రంలోని పలువురు డీఎస్పీలకు ఏఎస్పీలుగా ఉద్యోగన్నతి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో జిల్లాకు చెందిన నలుగురు డీఎస్పీలు ఏఎస్పీలుగా పదోన్నతి పొందారు. స్థానిక పీటీసీలో డీఎస్పీలుగా పని చేస్తున్న వై.హరినాథ్‌రెడ్డి, ఆర్.వాసుదేవన్, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.మహబూబ్‌బాషా, అనంతపురం టౌన్ డీఎస్పీగా పని చేస్తున్న వల్లూరి శ్రీనివాసరావు ఏఎస్పీలుగా ఉద్యోగోన్నతి పొందారు.

గూగూడులో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-నార్పల

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025లో భాగంగా గురువారం మండల పరిధిలోని గూగూడు గ్రామంలో కేంద్ర బృంద సభ్యులు పర్యటించారు. ముందుగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల పరిసరాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యుడు రామచంద్ర, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, జిల్లా కోఆర్డినేటర్ జ్యోతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్, ప్రధానోపాధ్యాయులు మదన్మోహన్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు హుసేనప్ప, కార్యదర్శి కీర్తన, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఓబులేసు, పాఠశాల పిఇటి శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ గౌతమి, మహిళా పోలీస్ రాజేశ్వరి, పంచాయతీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

పట్టణంలోని ప్రజావేదిక కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో సుమారు 20కి పైగా మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు.

22 వరకు తపాలా సేవలకు అంతరాయం

ప్రజాశక్తి-రాయదుర్గం

తపాలా శాఖలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కోసం ఈ నెల 22వ తేదీ వరకూ పట్టణంలోని తపాలా కార్యాలయంలో సేవలకు అంతరాయం కలగనున్నట్లు ఇన్‌ఛార్జి పోస్ట్ మ్యాస్టర్ సురేంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తపాల శాఖలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0కి మార్చనున్నందున ఈ నెల 22వ తేదీ వరకూ అన్ని తపాలా సేవలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

జలవనరుల లెక్కలపై సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని 7వ జల వనరుల లెక్కలపై గురువారం తహశీల్దార్ నాగరాజు అధ్యక్షతన మండల రెవెన్యూ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. జల వనరుల లెక్కలపై సహాయ గణాంక అధికారి కృష్ణయ్య వీఆర్వోలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన బోర్ వెల్స్ ఎక్కడెక్కడ ఉన్నాయి. సర్వే నంబర్ల ప్రకారం ఎంతమంది రైతుల బోర్ వెల్స్ పనిచేస్తున్నాయి. దీనిపై 30 రోజుల్లో గణన చేయాలని వీఆర్వోలను కోరారు. ఉడేగోళంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి అవగాహన కల్పించారు.

జర్నలిస్ట్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గంలో ఓ టీవీ ఛానల్‌లో పనిచేస్తున్న జర్నలిస్ట్ ఇషాక్‌ను గురువారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పరామర్శించారు. ఇషాక్ బుధవారం అర్ధరాత్రి అనారోగ్యానికి గురవడంతో అనంతపురంలోని తిరుమల ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

ఆర్టీసీ డిపో తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ఆర్టీసీ డిపోను గురువారం కడప రీజినల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.హరి సందర్శించి డిపోలోని గ్యారేజ్, స్టోర్, సెక్షన్ కార్యాలయాలను తనిఖీ చేశారు. బస్సుల కండిషన్, ప్రస్తుత సర్వీస్ ఆపరేషన్ గురించి డిపో మేనేజర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. డిపో మేనేజర్‌తో పాటు కార్మికులు, ఉద్యోగులు, వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. బస్సుల నిర్వహణ, నడపడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువల గురించి సూచనలు చేశారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపో గ్యారేజ్ ఇన్‌ఛార్జి ఎంఎల్.శిరీష, సెక్షన్ ఆఫీసర్లు కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

త్వరలోనే బిటిపికి నీరు తెస్తాం : ఎమ్మెల్యే

విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

త్వరలోనే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు నీరు తెస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. భూ కాలువ పనులు శరవేగంతో జరుగుతున్నాయని తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గురువారం మండలంలోని పోలేపల్లి, గుండిగానిపల్లి, బ్రహ్మసముద్రం, తదితర గ్రామాల్లో పర్యటించారు. ముందుగా వేపులపర్తి నుంచి పోలేపల్లి వరకూ నాబార్డు నిధులు రూ. 1.2 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. 2, 3 నెలల్లోనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పోలేపల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, వాల్మీకి, కనకదాసు, ఎన్టీఆర్ విగ్రహాలకి పూలమాలలు వేశారు. బ్రహ్మసముద్రంలో రైలు కింద పడి చనిపోయిన జవాను వడ్డే లక్ష్మన్న కుటుంబాన్ని పరామర్శించి, ఆయన భార్యకు రూ. 50వేలు అందజేశారు. జవాను కుటుంబాన్ని ఆదుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గుండె చికిత్స చేయించుకుని ఇంటి వద్ద ఉన్న ఎస్సీ కాలనీకి చెందిన హరిజన తిప్పేస్వామిని పరామర్శించి రూ. 5వేలు అందజేశారు. పింఛను మంజూరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ యార్డ్ ఛైర్మన్ లక్ష్మీదేవి, తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ రంగనాయకులు, పిఆర్ జెఈ విజయ్‌కృష్ణ, ఎంఇఒ ఓబుళపతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు కాశీంబి, రామాంజనమ్మ, జడ్పిటిసి ప్రభావ తమ్మ, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, రాష్ట్ర రైతు కార్యదర్శి కురుగౌడ, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓబులేష్, నాయకులు వన్నూరుస్వామి, నాగరాజు ఉన్నారు.

కర్నాటక ప్రాంతంలో పుష్కలంగా ఉన్న నీరు

ఆంధ్ర సరిహద్దు అనంతపురం జిల్లాలో నీరు లేని పరిస్థితి

పూర్తికాని కాలువల మరమ్మతులు

ఎపికి చేరని తుంగభద్ర నీరు .. రైతులు లబోదిబో..

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కర్నాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి నీరు విడుదల చేసినా ఆంధ్ర సరిహద్దు అయిన బొమ్మనహాల్ మండలంలో ఆగిపోయాయి. కర్నాటకలోని కాలువలకు సాగునీరు అందించి ఆంధ్రలో కాలువలకు నీటిని నిలుపుదల చేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలువల మరమ్మతుల పేరుతో ఆంధ్రకు నీటి సరఫరాను ఆపేశారు. ఆంధ్రకు సాగు, తాగునీరు ఎప్పుడు ఇస్తారో కూడా స్పష్టత లేదని రైతులు వాపోతున్నారు. కణేకల్లు సెక్షన్లకు 1.5 టిఎంసిలు, ఆంధ్రాకు 22 టిఎంసిలు కేటాయించారు. తుంగభద్ర జలాశయంలో 80 టిఎంసిలు నిలుపుదల చేయాలని జలాశయం సెంట్రల్ ట్రిబ్యునల్ కమిటీ తీర్మానం చేసింది. ఇదిలా ఉండగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకపోగా ఖరీఫ్ పంట ప్రారంభ దశలోనే సాగునీరు అందించలేకపోతే రైతులు ఎలా పంటలను కాపాడుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నీటిని విడుదల చేయగా నేటికీ ఆంధ్రాలో కాలువలు మరమ్మతులు చేయకుండా గుత్తేదారులు, ప్రభుత్వాలు కలిసి రైతులతో చెలగాటమాడుతున్నాయని మండిపడుతున్నారు. రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి, అనంతపురం ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే జలాశయాలను వినియోగించుకోవడంలో ఆంధ్ర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు కల్లు తెరిచి వెంటనే అనంతపురం జిల్లాకు అందాల్సిన వాటాలో నష్టం లేకుండా 22 టిఎంసిలు తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

కక్ష సాధింపులు లేని పాలన : ఎమ్మెల్యే

సుపరిపాలనలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రాణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షసాధింపులు లేకుండా పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని వడియంపేట గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడియంపేట గ్రామపంచాయతీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.10.59 లక్షలతో కొత్త పైప్‌లైన్, కొత్త బోర్‌మెల్, మోటర్ ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసిపి నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. అనంతరం నేతన్న ఇంటికి వెళ్లి కొద్దిసేపు స్వయంగా మగ్గం నేశారు. కాగా వడియంపేట గ్రామ పంచాయతీతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించగా స్పందించిన ఎమ్మెల్యే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేయాలని ఎఇని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, సర్పంచు నాగార్జున, పొడరాళ్ల రవీంద్ర, ఎంపిడిఒ సలమాన్‌రాజ్, పిఆర్ ఇంజినీర్ మద్దిలేటి, ఓబుళపతి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల సింగిల్‌విండో ప్రెసిడెంట్ ప్రమాణ స్వీకారం

బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-శింగనమల

మండల సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా గుర్రం లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, బ్యాంకు నూతన ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డైరెక్టర్లు బాలరాజు, లక్ష్మి, టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు మాసులు చంద్రమోహన్, చెన్నయ్య, వెంకటేష్, నాగేంద్ర, పెద్దనాగముని, పక్కీరప్ప, ముంతా వెంకటేష్, సొసైటీ సిఇఒ రసూల్, సూర్యనారాయణరెడ్డి, నారాయణస్వామి, కుళ్లాయిస్వామి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

యాడికి సింగిల్‌విండో అధ్యక్షులు..

యాడికి : మండల వ్యవసాయ సహకార సింగిల్‌విండో అధ్యక్షులుగా చలమారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చలమారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతోపాటు రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు చవ్వా గోపాల్ రెడ్డి, మాజీ ఎంపిపి వేలూరి రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, తదితరులు చలమారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిమి చరణ్, మదమంచి శివ, రాఘవ, శ్రీహరి, పేరం రవి, నీలకంఠ, నరసింహచౌదరి, రవికుమార్‌రెడ్డి, దడియాల ఆది, తదితరులు చలమారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు

కార్మికుల సమ్మెకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-రాయదుర్గం

సమ్మెలో భాగంగా పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన దీక్షకు గురువారం సిపిఎం నాయకులు నాగరాజు, తదితరులు సంపూర్ణ మద్దతు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, యూనియన్ నాయకులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో వారికి మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి : ఎస్పీ

ఎన్నికైన విద్యార్థితో ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు చిన్నప్పటి నుంచే మంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఎస్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఇటికలపల్లి సమీపంలో ఉన్న అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు ప్రజ్ఞ, మనోజ్‌సాయికి పట్టాభిషేక మహోత్సవం (ఇన్వెస్టిచర్ సెర్మనీ) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ విద్యార్థులకు బ్యాడ్జిలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని, భవిష్యత్తులో ఉన్నత స్థాయి అధికారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ఛైర్మన్ అనంతరాముడు మాట్లాడుతూ ఎన్నికైన విద్యార్థులను అభినందించి, సమాజానికి ఉపయోగపడే నాయకులుగా ఎదగాలని కోరారు. తదుపరి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్‌ఛైర్మన్ రమేష్‌నాయుడు, సిఇఒ నరసింహారావు, ప్రధానోపాధ్యాయురాలు శాలిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణం చేపట్టకపోతే ఇంటి పట్టా రద్దు

ప్రజాశక్తి-రాయదుర్గం

గత వైసిపి ప్రభుత్వంలో ఇంటి పట్టా మంజూరై ఇంతవరకూ గృహ నిర్మాణం చేపట్టని వారు పది రోజుల్లోగా గృహ నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేనిచో ఆ పట్టాను రద్దుచేసి అర్హులైన ఇతరులకు కేటాయిస్తామని తహశీల్దార్ నాగరాజు స్పష్టం చేశారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఇల్లు నిర్మించుకోని లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఇళ్ల స్థలం కేటాయించి ఇంటి పట్టా మంజూరై ఇంతవరకూ గృహ నిర్మాణం చేపట్టని 1,136 మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు వెంటనే గృ నిర్మాణం చేపట్టాలని, లేనిచో వాటిని రద్దు చేసి స్థలం స్వాధీనం చేసుకుని అర్హులకు పంపిణీ చేస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

రాయదుర్గం : సేవా భారతి స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు ప్రణవ్ సాయి తన అక్క జన్మదినం పురస్కరించుకుని గురువారం పట్టణంలోని మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో కేక్ కట్ చేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, రోడ్డుపక్కల ఉన్న పేదలు, అనాథలకు దుప్పట్లు, ఆహారం అందజేశారు. కార్యక్రమంలో ఛేంజ్ ఫర్ సొసైటీ నిర్వాహకులు జబీఉల్లా, మంజునాథ్, మంజు, హరి, మనోహర్, జాన్‌పాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ సిబ్బందికి సత్కారం

యాడికి : బదిలీపై వెళ్లిన సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ ఎంకె సూర్యనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారులు, 12 మంది గ్రామ సర్వేయర్లను గురువారం ఎంపిడిఒ సమావేశ భవనంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప, సర్వేయర్ శేషసాయి, రెవెన్యూ సిబ్బంది దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పం అందజేస్తున్న రామలింగారెడ్డి

సిఎంను కలిసిన రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం : ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ జెడ్పీటీసీ కె.రామలింగారెడ్డి కర్నూలు విమానాశ్రయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి (కోడుమూరు నియోజకవర్గ పరిశీలకుడు) కాటప్పగారి రామలింగారెడ్డి గారు. ప్రస్తుత శింగనమల నియోజకవర్గ పరిస్థితులపైన చర్చించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు

రూ.21 లక్షల వార్షిక వేతనంతో జెఎన్‌టియు విద్యార్థినికి ఉద్యోగం

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియులో విద్యనభ్యసించిన విద్యార్థిని ఎస్.హర్షిత రూ.21లక్షల వార్షికోత్సవ వేతనంతో ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమేజాన్‌లో ఉద్యోగం సాధించింది. ఈమేరకు గురువారం స్థానిక జెఎన్‌టియులోని విసి కాన్ఫరెన్స్ హాలులో విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి విసి ఎన.దేవన్న అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ జెఎన్‌టియు విద్యార్థిని ఈ ఘనత సాధించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.23 కోట్ల టెండర్ వృథా..!

మరోసారి రూ.17 కోట్లతో చెత్త బయోమైనింగ్

పబ్లిక్ హెల్త్‌కు బయోమైనింగ్ పనుల పర్యవేక్షణ

నేడు ప్రారంభించనున్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

బయోమయమైన డంపింగ్ యార్డ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త స్కాం జరిగిందంటూ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రతి కౌన్సిల్ సమావేశం, నగర పర్యటన సందర్భంలో విమర్శలు చేస్తూనే ఉన్నారు. దీనిపై ఏడాది కాలంగా నగరంలో పెద్ద ఎత్తున రాజకీయ వివాదం నడుస్తూనే ఉంది. తాజాగా రూ.17కోట్లతో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌తో సహా మరో నాలుగు మున్సిపాలిటీలో చెత్త బయోమైనింగ్ పనులను జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నాడు ఈ పనులను ప్రారంభించడానికి రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అనంతపురం నగరానికి రానున్నారు. రెండేళ్ల క్రితం రూ.23 కోట్లతో బయో మైనింగ్ టెండర్లను లెస్ రేట్లతో హైదరాబాద్‌కు చెందిన ఎనర్జీ సొల్యూషన్స్ కంపెనీ దక్కించుకుంది. రూ.11 కోట్ల వరకు బిల్లులు చేయించారు. ఈ బిల్లుల చెల్లింపు వ్యవహారంపై వైసిపి, టిడిపి నాయకుల మధ్య ఇప్పటికీ మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా రూ.17 కోట్ల కొత్త టెండర్లతో బయో మైనింగ్ పనులను జిగ్మ గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 4.92 శాతం ఎక్సెస్ రేట్లతో పనులు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక సూపరిండెంట్ ఇంజినీర్, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఆరుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఐదుగురు రెగ్యులర్ అసిస్టెంట్ ఇంజినీర్లు, సచివాలయానికి సంబంధించి మరో ఏడుగురు ఇంజినీర్లు అందుబాటులో ఉన్నారు. ఇంత మంది సిబ్బంది ఉన్న విభాగాన్ని కాదని కంపోస్ట్ యార్డులో చెత్త బయో మైనింగ్ పనుల పర్యవేక్షణను పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించడం విశేషం. అక్కడ తగినంత సిబ్బంది లేకున్నా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటన్న సందేహాలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో గతంలో నిర్వహించిన తాగునీరు, ఇతర ప్రాజెక్టుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కాగ్ నివేదికలు అందించింది. దీంతో సంబంధిత ఇంజినీర్లకు ఇంక్రిమెంట్ తదితరాలపై కోతలు పడ్డాయి. గతంలో జరిగిన బయో మైనింగ్ అవినీతి అక్రమాలపై నిజానిజాలు నిగ్గు తేల్చకుండా విచారణ అటకెక్కిందనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో డిస్ట్రిబ్యూషన్ పైప్లైన్ పనులు పర్యవేక్షించిన అధికారే ప్రస్తుతం పబ్లిక్ హెల్త్‌లో కీలక స్థానంలో ఉండటం విశేషం. డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ పనులు ప్రజలకు రక్షిత నీటిని అందించాలని ఉద్దేశంతో చేపట్టినప్పటికీ ఇప్పటివరకు నగర ప్రజలకు పూర్తిస్థాయిలో బ్లూ పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా జరగడం లేదు. ఈ పరిస్థితుల్లో బయోమైనింగ్ పర్యవేక్షణ పనులను ఆ విభాగానికి అప్పగించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కంపోస్ట్ యార్డులో బయో మైనింగ్ పనులు నిలిచాయి. ప్రతి రోజూ నగరంలోని 120 మెట్రిక్ టన్నుల చెత్త తరలింపు జరుగుతోంది. కంపోస్ట్ యార్డ్‌లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కొండలను తలపిస్తోంది. నగర శివారు పంచాయతీలైన రుద్రంపేట, రాజీవ్ కాలనీ, నారాయణపురం, గ్రామాల చెత్త సైతం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కంపోస్ట్ యార్డుకే తరలిస్తున్నారు. బయో మైనింగ్ జరిపిన తర్వాత వ్యర్థాలను తరలించేందుకు అవసరమైన స్థల సేకరణ ఇప్పటివరకు జరగలేదు. అప్పట్లో జరిగిన బయోమైనింగ్ వ్యర్థాలను ఎక్కడ వేశారన్న అంశంపై అధికార వర్గాలు, రూ.23 కోట్ల టెండర్ పనులు దక్కించుకున్న నోవాస్ గ్రీన్ ఎనర్జీ సిస్టమ్స్ హైదరాబాద్ కౌన్సిల్‌కు అవసరమైన సమాచారం ఇవ్వలేక ముఖం చాటేసింది. పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో జరిగే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కంపోస్ట్ యార్డ్‌తో పాటు తాడిపత్రి రాయదుర్గం కళ్యాణదుర్గం గుంతకల్లు మున్సిపాల్టీల్లో బయోమైనింగ్ పనులను జిగ్మా కంపెనీ నిర్వహించనుంది. వీటి పర్యవేక్షణ బాధ్యత ఆయా మున్సిపాలిటీలకు కాకుండా చాలినంతమంది సిబ్బంది లేని పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించటం ద్వారా గతంలో మాదిరిగా జరిగే అక్రమాలు అవినీతి బహిర్గతం కాకుండా చూడటమే ప్రభుత్వ ఆలోచనగా ఉందని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సాలిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లావ్యాప్తంగా ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సాలిరెడ్డి హెచ్చరించారు. గురువారం ఉరవకొండలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా పలు దుకాణాల్లో భౌతిక నిల్వలు, ఈ-పాస్ నిల్వలకు వ్యత్యాసాలు ఉండటంతో కొన్నిరకాల మందులు, ఎరువులను అమ్మకుండా నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను సకాలంలో తెప్పించాలని ఆదేశించారు. జిల్లాలో మూడు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో అనేక అక్రమాలు గుర్తించడంతోపాటు ఆరు కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా రూ.4.6 కోట్ల విలువైన ఎరువుల అమ్మకాలని నిలుపుదల చేసినట్టు చెప్పారు. కాగా తనిఖీ బృందం పర్యటిస్తున్నట్లుగా తెలుసుకున్న పలువురు తమ ఎరువుల దుకాణాలకు మూతవేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఆఫీస్ టెక్నికల్ ఇఒ రాకేష్‌నాయక్, ఉరవకొండ డివిజన్ ఎడిఎ సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఎఇఒ భరత్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బొమ్మనహాల్ : మండలంలోని బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన బోయ వన్నూరు స్వామి(49) గురువారం వ్యవసాయ పొలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ నబిరసుల్ తెలిపారు. మృతదేహంపై అక్కడక్కడ గాయాలు ఉన్నాయని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక అసలు విషయాలు తెలుస్తాయన్నారు. వన్నూరుస్వామి భార్య వన్నూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బోయ వన్నూరుస్వామి, అతడి కుమారుడు మోహన్‌కు మధ్య ఆస్తి తగాదాలు ఉన్నట్లు సమాచారం.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి

రాయదుర్గం : పట్టణంలోని ఓబుళాచారి రోడ్డు వద్ద నివసిస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం సురే శంకరప్ప(83) అనారోగ్యంతో బళ్లారిలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన పట్టణంలోని వివిధ మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, హెచ్‌ఎంగా పని చేసి ఉద్యోగ విరమణ చెందారు. స్వకులసాలి సామాజిక వర్గానికి చెందిన ఆయన ఆ సమాజం ప్రధాన కార్యదర్శిగా, విద్యావర్తక సంఘం కార్యదర్శిగా సేవలందించారు. ఆయన బోధనలో అనేకమంది విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఆర్ఒ మలోల

ప్రజా సంక్షేమం కోసం వెలసిన బుద్ధుడి భావాలు..అంబేద్కర్ ఇజం..

డిఆర్ఒ మలోల

ప్రజాశక్తి అనంతపురం సిటీ

సమాజ హితం.. సమ సమాజ స్థాపన కోసమే బుద్ధిజం, అంబేద్కర్ ఇజంఉద్భవించాయని డిఆర్ఒ మలోల అన్నారు. గురువారం స్థానిక కృష్ణ కళామందిర్‌లో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి 'బుద్ధునితో నా ప్రయాణం' (అంబేద్కర్ బౌద్ధ దమ్మ పునర్జీవన నేపథ్యం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసమే ఉద్భవించిందే అంబేద్కర్ ఇజమన్నారు. అంతకుమునుపే సమానత్వం, అహింసా మార్గంతో బుద్ధుడు ప్రపంచాన్ని బుద్ధిజం వైపు నడిపించారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు నల్లప్ప, సామాజికవేత్త తరిమెల అమర్నాథ్‌రెడ్డి, మేధావులు, సాహితీవేత్తలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

5వరోజుకు చేరుకున్న కార్మికుల సమ్మె

చెవిలో పూలు పెట్టుకుని మోకాళ్లపై నిరసన

అనంతపురంలో చెవిలో పూలు పెట్టుకుని మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు తలపెట్టిన సమ్మె గురువారం ఐదవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గురువారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట కార్మికులు మోకాళ్లపై నిలబడి, చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె రోజురోజుకూ ఉధృతం అవుతోందన్నారు. అయితే సమ్మె విరమించాలని కార్మికులపైన అధికారులు ఒత్తిడి తెస్తూ.. కేసులు పెట్టి పోలీసుల ద్వారా బెదిరింపులకు దిగుతుండటం బాధాకరమన్నారు. మీరేం చేసినా ప్రభుత్వం దిగొచ్చేంత వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, రవికిరణ్, లోక్‌ణాథ్, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, కోనప్ప, అక్కులప్ప, శేషేంద్ర, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు..

గుత్తి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం 5వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీగా వచ్చి మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ, పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షుడు కె.సూర్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం 26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజా, రవిశంకర్, ఉపాధ్యక్షుడు ఎస్‌ఎ.మురళి , సహాయ కార్యదర్శి ఆది, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఎన్. రామాంజనేయులు,కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్ మాట్లాడుతూ జీవో నెం.36 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75వేలు ఇవ్వాలని, దహన సంస్కార ఖర్చులకు రూ.20వేలు అమలు చేయాలనే తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరికి ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామాంజనేయులు, రామ్మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరాములు, జుబేర్ బాబు, బాషా, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరం వద్దకు జెసి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె శిబిరాన్ని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

క్రికెట్ పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

ఆర్డీటీ క్రీడాపోటీల్లో శ్రీవాణి స్కూల్ జట్టు విజయం

తాడిపత్రి : తాడిపత్రి జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ క్రీడాపోటీల్లో శ్రీవాణి జట్టు విజయం సాధించింది. ఇందులో భాగంగా గురువారం పద్మవాణి, శ్రీవాణి జట్ల మధ్య జరిగిన పోటీలను కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున టాస్ వేసి ప్రారంభించారు. ఉత్కంఠంగా సాగిన పోరులో శ్రీవాణి జట్టు విజయం సాధించింది, ఈజట్టులో శ్రుతి కీర్తన 24 పరుగులు సాధించింది. అనంతరం చర్చి స్కూలు, కెజిబివి కస్తూరిబా జూటూరు జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో చర్చి స్కూల్ జట్టు విజయం సాధించింది. చర్చి స్కూల్ జట్టులో మన్విత 27 పరుగులు సాధించింది. జూటూరు జట్టులో సంగీత 3 వికెట్లు సాధించింది. అబ్బాయిల మ్యాచ్‌లో సాయితేజ, పెద్దపప్పూరు మోరియా స్కూల్ జట్టు తలపడగా మోరియా జట్టు విజయం సాధించింది. మౌర్య స్కూల్ జట్టులో విష్ణుకుమార్ 19 పరుగులు, 4 వికెట్లు సాధించాడు.

నేడు ఎస్.గూడూరులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

పుట్లూరు : మండలంలోని ఎస్.గూడూరులో శుక్రవారం 'సుపరిపాలనలో తొలిఅడుగు-ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ బాలరంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

21న చలో విజయవాడ

ప్రజాశక్తి-గుత్తి

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21వతేదీన చేపట్టనున్నట చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ నాయకుడు రంగస్వామి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం మున్సిపాలిటీలోని మీటర్ రీడర్స్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటర్స్ రీడర్లకు సంస్థలోనే ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపించాలన్నారు. యాజమాన్యం నిర్ణయించిన పనిదినాలను యథావిధిగా అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి మీటర్ రీడర్ల యూనియన్ నాయకులు కుళ్లాయి, మదన్, చక్రపాణి, మల్లి, ఉపేంద్ర, దాదా సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

GUNTAKAL MUNICIPALTY

e-Procurement Tender Notice

S.No	e-Tender Notice No	No of Works	Estmate Cos in Lakhs
1	02/2025-26/GENERAL FUNDS/E3 dated:17.07.2025 short tender	5	Rs.94.43
2	03/2025-26/GENERAL FUNDS/E3 dated:17.07.2025	9	Rs.111.70
3	04/2025-26/ 15th FCG/E1 dated:17.07.2025	9	Rs.138.98
4	26/2024-25/ 15th 23-24/E1 dated:17.07.2025 2nd call	1	Rs.42.00

Further details can been seen at e-procurement market place i.e., https:tender.apeprocurement.gov.in.

Sd/- Commissioner
Guntakal Municipality

నిమజ్జన ఘాట్ పరిశీలన

గుంతకల్లు : వచ్చేనెలలో జరుగనున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో పట్టణ సమీపంలో ఉన్న నిమజ్జన ఘాట్‌ను తహశీల్దార్ రమాదేవి, కమిషనర్ నయీమ్ అహమ్మద్, ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి గురువారం పరిశీలించారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని గుమ్మనూరు నారాయణస్వామి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు ఇంతియాజ్ అలీ, వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి, టిడిపి పట్టణ అధ్యక్షుడు ముక్కన్నగారి గుణశేఖర్, మండల కన్వీనర్ బండారు రామన్నచౌదరి, ప్రధాన కార్యదర్శి షేక్ ఫజులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE,ANANTHAPURAMU

S.O.P.No.9/2025

Between:
1.Kuchi Kalavathi
2.Kuchi Sailaja
3.Kuchi Narayana Swamy **...Petitioners**

AND

Nil **...Respondant**

NOTICE TO WHOM SO EVER CONCERNED

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా మా కక్షిదారులైన 1.Kuchi Kalavathi W/o Late Kuchi Krishnamurthy, 2.Kuchi Sailaja D/o Late Kuchi Krishnamurthy, 3.Kuchi Narayana Swamy S/o Late Kuchi Krishna murthy, Peravalli (V), Singanamala (M), Ananthapuramu (Dist), Kuchi Krishna murthy గారు S.K.University, Ananthapuramu నందు Attender గా ఉద్యోగము చేస్తు 30-09-2021వ తేది రోజు మరణించినారు. ఈయన వారుసులైన పైన తెలిపిన Petitioners ముగ్గురు Kuchi Krishnamurthy యొక్క వారసులు ఈ ముగ్గురికి S.K.University నందు Kuchi Krishnamurthy గారి Death Benifits కోసం వారసత్వం Certificate కొరకు పై కోర్టునందు S.O.P.No.9/2025 కేసువేసి యున్నారు.కావున ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల 11-08-2025వ తేది రోజు పై కోర్టు నందు ఖుద్దున గాని వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకోవలెను. లేని యెడల కోర్టువారు మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(By Order of Court)

T.R.NARAPPA REDDY,
Advocate, Ananthapuramu.
Cell No.9440152722

డంపింగ్ యార్డు విషయంలో 'చెత్త' పనులు ఆపండి

టిడిపి నాయకుల హెచ్చరిక

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధికారంలో ఉండగా డంపింగ్ యార్డు విషయంలో అవినీతికి పాల్పడిన వైసిపి నాయకులు ఇప్పుడు అదే డంపింగ్ యార్డును తరలిస్తుంటే అడ్డంకులు సృష్టించడం బాధాకరమని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డు తరలింపునకు వేగంగా అడుగులు పడుతున్న నేపథ్యంలో కొందరు వైసిపి నాయకులు గ్రామస్తుల ముసుగులో ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఎన్నికలకు ముందు డంపింగ్ యార్డును అనంతపురానికి దూరంగా తరలిస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీ మేరకు యార్డును తరలిస్తున్న క్రమంలో వైసిపి నాయకులు కొన్ని గ్రామాల ప్రజలను రెచ్చగొట్టి ఆందోళనలు చేయించడం ఏంటని ప్రశ్నించారు. నాలుగేళ్ల పాటు మీరు అధికారంలో ఉండి చేసిన అవినీతి గురించి ప్రజలందరికీ తెలుసునన్నారు. ఇప్పటికైనా మీ కుట్రలు మానుకోకపోతే టిడిపి నుంచి కూడా ప్రతి చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల నరసింహులు, పరమేశ్వర్, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు, నాయకులు సుధాకర్‌యాదవ్, సాకే లక్ష్మీనరసింహ, ఫిరోజ్ అహ్మద్, జయరామ్‌నాయక్, కరుణాకర్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అరటి, చీనీ, దానిమ్మ, మామిడి పంటలు సాగు చేసిన రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధిస్తారని రెడ్డిపల్లి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో అత్యల్ప వర్షపాతం మండలం, సదరన్ జోన్ నుంచి విచ్చేసిన కెవికె, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, కోఆర్డినేటర్లు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో అభ్యుదయ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ఎడిఆర్ ఎం.జాన్సన్ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఆధునిక పద్ధతుల గురించి ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు తెలుసుకుంటూ రైతులకు చేదోడు వాదోడుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి పరిశోధనా స్థానం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్ఎన్ మల్లీశ్వరి, భార్గవి, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి విజయ శంకర్‌బాబు, గణేష్‌శర్మ, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నకుమార్, రాయలసీమలోని ఐదు జిల్లాల శాస్త్రవేత్తలు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వసతి గృహంలో సమస్యల పరిష్కారానికి వినతి

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు సూర్యప్రకాష్

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో నీటి వసతి లేక విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికితోడు వసతి గృహం చుట్టూ ముళ్లపొదలు ఉండటంతో భయాందోళన చెందుతున్నారన్నారు. కావున వసతి గృహం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రహరీ నిరించాలని, తాగునీటి వసతి కల్పించాలని కోరారు.

'నాడు-నేడు' అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఎపి వ్యకాసం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

విలేకరులతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

గత వైసిపి హయాంలో చేపట్టిన నాడు-నేడు పనుల్లో అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం కూడేరు మండలంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూడేరు, కొర్రకోడు, కమ్మూరు గ్రామాల్లో నాడు-నేడు కింద చేపట్టిన పనుల్లో అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. వీటిపై ఇప్పటికే ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్, ఆర్థికశాఖ మంత్రి కేశవ్, డిఇఒ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నాడు-నేడు పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్.కరీంసాబ్, మల్లికార్జున, రాధాకృష్ణ, వీరప్ప, వెంకటేశులు, మేకల పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

యాడికి కాలువ పనుల పరిశీలన

యాడికి : పెద్దవడుగూరు ప్రధాన కాలువ నుంచి యాడికి బ్రాంచి కెనాల్ వరకూ చేపట్టిన పూడికతీత, ముళ్లపొదల తొలిగింపు పనులను తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సొంత నిధులు రూ.20లక్షలతో ఈ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆయా పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, రవికుమార్‌రెడ్డి, నరసింహచౌదరి, కోడూరు నీలకంఠారెడ్డి, పరిమి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఇంటింటి చెత్త సేకరణ ప్రారంభం

పామిడి : మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి ఇంటింటి చెత్త సేకరణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా మండలంలోని దేవరపల్లి, జి.కొట్టాల పంచాయతీల్లో చేపట్టిన చెత్త సేకరణను డిప్యూటీ ఎంపిడిఒ అశ్వర్థనాయుడు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి గ్రామ పంచాయతీ అధికారి మునీంద్ర, పంచాయతీ సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్లూరు : మండల కేంద్రంతోపాటు సూరేపల్లి గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ శేషారెడ్డి గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఎక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాలను రెండుగా చేసేందుకు అనుకూలంగా ఉన్నాయా.. లేదా.. ప్రాథమిక పాఠశాలలో అడిగి తెలుసుకున్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం

యాడికి : మండల కేంద్రంలోని గుత్తి రోడ్డులో ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును టిడిపి సీనియర్ నాయకులు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, చలమారెడ్డి, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి గండికోట లక్ష్మణ్, బంకు యజమాని భాస్కర్, కోడూరు నీలకుంఠారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కుళ్లాయిస్వామి హుండీల లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఆలయ ఆవరణలో లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో పోగుచేసిన 4వేల కిలోల చక్కెరను వేలం వేయనున్నట్లు తెలిపారు.

జెఎన్‌టియు విసిని కలిసిన మురళి

రాప్తాడు : జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావును మండల టిడిపి ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా విసికి పుష్పగుచ్ఛం అందజేశారు.

తహశీల్దార్‌కు సన్మానం

పామిడి : నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ షర్మిల, డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సురేఖను గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుపతినాయుడు, క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, జయరామ్‌రావు, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

అనంతపురం రూరల్ : పలువురు బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎంపి అంబికా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. గురువారం నగరంలోని ఎంపి కార్యాలయంలో పలువురు బాధితులకు రూ.10,06,316 విలువైన చెక్కులను బాధితులకు అందించారు.